ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నేటి నుంచి మొంథా ప్రభావం!



దుగ్గిరాల మండలంలో వర్షపు నీరు నిల్వ ఉన్న కారణంగా చనిపోతున్న సపోటా చెట్లు

- తుపాను వల్ల రేపు, ఎల్లుండి అతిభారీ వర్షాలు
- వాతావరణ శాఖ హెచ్చరిక
- యంత్రాంగం అప్రమత్తం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మొంథా తుపాను ప్రభావం సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం భారీ వర్షాలు కురుస్తాయి. మంగళ, బుధ వారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావస కేంద్రాలకు పంపాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

భారీ వర్షాలంటే గరిష్టంగా 115 మిల్లీ మీటర్లు, అతి భారీ వర్షం 204 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రకృతి వైపరిత్యాల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. 100 కిలో మీటర్ల వేగంతో గాలులు వీయవచ్చునని తద్వారా భారీ వృక్షాలు, పురాతన ఇళ్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావొచ్చని తెలిపింది. గుంటూరులో పలు ప్రాంతాల్లో ముంపు సమస్యలు తలెత్తవచ్చని అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. 12 ప్రాంతాల నుంచి ప్రజలను తరలించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు పూర్తి స్థాయిలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్టు గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. ఎవ్వరూ పిల్లలను బయటకు పంపవద్దన్నారు. పల్నాడు జిల్లాలో సోమవారం సెలవు ప్రకటించారు.తుపాను వల్ల కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ముంపు సమస్య ఎక్కువగా వుండవచ్చని అంచనా వేస్తున్నారు. అన్ని మండలాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కంట్రోలు రూంలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

భారీ వర్షాల ప్రభావంతో పంటలకు ముంపు సమస్య ఏర్పడనుంది. ప్రధానంగా కోతలకు సిద్ధంగా ఉన్న వరి, కంది, తీయడానికి సిద్ధంగా ఉన్న ప్రత్తి, ఎదుగుదల దశలో ఉన్న మొక్కజొన్న, మిర్చి ఇతర పంటలకు ముంపు బెడద పొంచి ఉంది. ఇప్పటికే గత కొన్ని నెలలుగా విస్తారంగా వర్షాలు కురవడం వల్ల మురుగు, ముంపు సమస్య వెంటాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల ప్రభావంతో డెల్టాలోని పలు మండలాల్లో ▶ 2లో

అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సైతం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంగన్వాడీ కేంద్రాలు సహా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది వారి సచివాలయం ఫరిధిలోనే ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసర ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను, పూరి గుడిసెల్లో ఉండేవారిని పునరావాస కేంద్రాలు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెకక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయలను తక్షణమే పరిష్కరించాలని, ప్రజలు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్, ఆర్డిఓ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాలతో పాటు అన్నీ మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు.



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి సిసోసిడియా

యంత్రాంగం సన్నద్ధం

- గుంటూరు జిల్లా ప్రత్యేకాధికారి సిసోడియా
- అవసరమైతేనే బయటకు రావాలి - ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మొంథా తుపాను దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి ఆర్.పి.సిసోడియా అన్నారు. జిల్లాలో తుపాను పరిస్థితులపై సమీక్షించేందుకు ఆదివారం గుంటూరు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ కార్యకలాపాలను తనిఖీ చేశారు. జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తుపాను తీవ్ర తుపానుగా పరిణామం చెందుతున్న తరుణంలో సన్నద్ధతపై సమీక్షించామన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉంచామని, ఎప్పుడు అవసరమైతే అప్పుడు ప్రజలను తరలిస్తామని చెప్పారు. ఆహార నిల్వలు సిద్ధంగా ఉంచాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరు ఉండరాదని, బలహీనంగా ఉన్న గోడలు, పూరిళ్లల్లో ఉన్న వారిని గుర్తించి వారిని పునరావస కేంద్రాలకు తరలించాలని అన్నారు. బలహీనంగా ఉన్న చెట్లు, పడిపోవడానికి అవకాశం ఉన్న చెట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్ రంపాలు (పవర్ సాస్) సిద్ధంగా పెట్టుకుని చెట్లు పడితే తక్షణం తొలగించుటకు సిద్ధంగా ఉండాలన్నారు. గండి పడేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను, ప్రమాదకరంగా ఉన్న కాజ్ వేలు, తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. మొబైల్ టవర్లు నిరంతరం పనిచేయాలని, మొబైల్ ఆపరేటర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మొబైల్ ఫోన్‌లలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామని, కలెక్టర్ కార్యాలయం సహా డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.

అవసరమైతేనే బయటికి రండి :

తుపాను ప్రభావం రానున్న మూడ్రోలుంటుందని, అందువల్ల అవసరమైతేనే ప్రజలు బయటికి రావాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా విజ్ఞప్తి చేశారు. మూడ్రోజులకు అవసరమైన ఆహార సామగ్రిని ఇళ్లలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ ▶ 2లో

4న విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగం ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 4న తిరుపతిలో నిర్వఇంచే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ ఎపిసిపిడిసిఎల్ డిస్కమ్ కమిటీ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నాయన్నారు. కేంద్రం 2018 నుండి విద్యుత్ సవరణలు బిల్లును ప్రతిపాదిస్తూ ప్రైవేటీకరణను ఇతర మార్గాల ద్వారా



మాట్లాడుతున్న నాయకులు

విస్తరింపజేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, ఎలక్ట్రిసిటీ జాతీయ ఫెడరేషన్లు, కేంద్ర కార్మిక సంఘాలు ముఖ్యంగా రైతు సంఘాలు విరోచిత పోరాటాలు ఫలితంగా ఈ బిల్లును పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి ▶ 2లో

ప్రభుత్వ విద్యలో సమగ్ర మార్పులు అవసరం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ విద్యారంగంలో ఎంతసేపూ ఉపాధ్యాయులనే బాధ్యలను చేస్తూ మార్పులెన్ని తెచ్చినా అది సంపూర్ణ విద్యా సాధనకు దోహద పడదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుల ఎ.ఎన్.కుసుమకుమారి అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో కుసుమ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య ఫరిడవిల్లాలంటే ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టి బాధ్యత వహించాలని చెప్పారు. దీనిని వదిలేసి కేవలం ఉపాధ్యాయులపై భారంమోపడం, నిందించడం ప్రభుత్వ విద్యారంగాన్ని, పతనానికి దిగజార్చుతుందని అన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణలు, తనిఖీలు, పరీక్షలు తప్ప ప్రభుత్వం, తల్లిదండ్రుల విధానం ఏమి మారిందని... జవాబుదారీతనం ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రభుత్వం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులలో సమిష్టి జవాబుదారీతనం పెరిగితే ప్రభుత్వవిద్య విలసిల్లుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్రప్రచురణల కమిటి చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న కుసుమకుమారి





సిఎం చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం జరిగే మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి రిసెప్షన్‌కు సిఎం చంద్రబాబు రానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. డ్రోన్లు, కెమెరాల సహాయంతో సీఎం పర్యటన భద్రతపై నిఘా వేశారు.



మైనర్ల డ్రైవింగ్‌ను ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి - తెనాలి

మైనర్ల డ్రైవింగ్ ఉపేక్షించేది లేదని త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో రెండు రోజులుగా వాహనాల తనిఖీ చేపట్టామని ఆదివారం ఆయన చెప్పారు. ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లు 40 మంది పట్టుబడ్డారని, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారు కూడా ఉన్నారని, పరిమితికి మించి ముగ్గురు నలుగురు కూడా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ పట్టుబడ్డరని అన్నారు. వారి వాహనాలను స్టేషన్‌కు తరలించామని, మోటర్ వాహనాల చట్టం ప్రకారం వారికి అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. మైనర్ల డ్రైవింగ్కు తల్లిదండ్రులు కూడా బాధ్యులేనని, దానిని నియంత్రించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సైలు కరిముల్లా, ఎన్.ప్రకాశరావు ఉన్నారు.

బీమా సొమ్ము అక్రమంగా పొందిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - తెనాలి

తల్లిదండ్రుల పేరిట ఉన్న బీమా సొమ్మును సోదరుడిని మోసం చేసి ఒక్కడే క్లెయిమ్ చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒన్‌టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చినరావూరు ప్రాంతానికి చెందిన కొండూరు రమేష్, కొండూరు రాజేష్ ఇరువురు అన్నదమ్ములు. వారి తల్లిదండ్రులు మృతి చెందిన తర్వాత వారి పేరిట ఉన్న బీమా సొమ్మును స్వాహా చేసేందుకు రమేష్ తన సోదరుడు రాజేష్ పేరు లేకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొంది, బీమా సొమ్ము రూ.7 లక్షలు క్లెయిమ్ చేశాడు. దీనిపై రాజేష్ పోలీసులను ఆశ్రయించడంతో ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

షాడో ఎమ్మెల్యే చెబితేనే పనులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మున్సిపాలిటీలో ఏ పని చేయాలన్నా షాడో ఎమ్మెల్యే అనుమతి తప్పనిసరి అని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఆయన ఆదివారం పర్యటించారు. నరసరావుపేట మున్సిపాలిటీలో టెండర్లు ఒకే పేరు మీద వేయాలని, పనులన్నీ ఒక్కరే చేయాలని ఆ షాడో ఎమ్మెల్యే చెప్తేనే మున్సిపాలిటీలో పనులు జరుగుతాయని అన్నారు. వైసిపి హయాంలో టిడ్కో ఇళ్ల వద్ద సబ్ స్టేషన్, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తే తాను కట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రచారం చేసుకుంటున్నారని, ప్రచారంపై పెట్టిన శ్రద్ధ పట్టణంలో చెత్త తీసి శుభ్రం చేసే కార్యక్రమంపై పెట్టాలని అన్నారు. జిల్లా జడ్జి, డిఎస్పి కార్యాలయాల సమీపంలో చెత్త పేరుకుపోయి మురికి కూపంలా ఉందన్నారు. కాల్వల్లో పూడికలు తీయడం లేదని, వర్షాలకు మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు ప్రజలుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, వీధులు గుంతల మయంగా మారాయని విమర్శించారు. కొద్దిరోజుల క్రితం హోంగార్డు డిఎస్పి బంగ్లా ఎదురుగా ఉన్న రోడ్డు గుంత వల్ల ద్విచక్ర వాహనంపై నుంచి పడి మరణించారని చెప్పారు. మున్సిపాలిటీలో రూ.కోట్ల నిధులున్నా గుంతలు పూడ్చడం, ప్యాచ్ వర్క్‌లు చేయలేకపోవటం సిగ్గుచేటన్నారు. ఆ గుంతలో పాలుపోసి నిరసన తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రత్యేక అధికారి ద్వారా పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. కూరగాయల మార్కెట్ నుండి ఏడాదికి రూ.23 లక్షలు మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని, అయినప్పటికీ మార్కెట్‌లో అపారిశుధ్యం తాండవిస్తోందని అన్నారు. మల్లమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ 6 నెలల నుండి పని చేయడం లేదని దీంతో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదన్నారు. పట్టణంలో పారిశుధ్య, మౌలిక సదుపాయాల కల్పనపై ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు.



గుంతలో పాలుపోస్తున్న శ్రీనివాసరెడ్డి

నేటి నుంచి మొంథా ప్రభావం!

(మొదటి పేజీ తరువాయి)

ముంపు సమస్య ఏర్పడింది. కొల్లిపర, పెదకాకాని, తెనాలి, చేబ్రోలు, పొన్నూరు, పెదనందిపాడు, కాకుమాను, తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ మండలాల్లో ముంపు బెడద ఎక్కువగా ఉంది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడం వల్ల చిన్నపాటి వర్షాలకు కూడా పొలాల్లో నీరు బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే ఆగస్టు రెండో వారంలో కురిసిన అతి భారీ వర్షాలకు 70 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నా రైతులకు పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో పంటలు చేతికి వచ్చే దశలో భారీ తుపాను రావడంపై రైతుల్లో ఆందోళన నెలకొంది.

యంత్రాంగం సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతరయం ఏర్పడే అవకాశాలున్నందున టార్చ్ లైట్స్, క్యాండిల్స్ సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంతో సహా డివిజన్, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. పంటలను సంరక్షించుకొనుటకు, పశువులను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూడ్రోజులపాటు ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థలకు - పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. గర్భిణులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ముందుగానే వైద్య సేవలందించడానికి, ఆసుపత్రులకు తరలించడానికి అన్ని ఏర్పాట్లూ చేశామని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 12 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, వారికి అవసరమైతే తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్నామని, అన్ని శాఖలను పూర్తి అప్రమత్త చేశామని అన్నారు. తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. తుపాను అనంతరం పారిశుధ్యం, వైద్య సేవలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో పీకల వాగు వల్ల ఇబ్బందులు లేకుండా తగిన మోటార్లు ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ, డిఆర్ఒ ఖాజావలి పాల్గొన్నారు.

4న విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

పంపిందని, ఇప్పుడు మళ్లీ అక్టోబర్ 9న కేంద్రప్రభుత్వం విద్యుత్ సవరణలు ప్రతిపాదిత ముసాయిదా బిల్లును ముందుకు తెచ్చి రాష్ట్రాల అభిప్రాయాలు కోరుతోందని తెలిపారు. ఈ ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా సంస్థలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగిపోతుందని, సంస్థ నష్టాల పాలవుతుందని చెప్పారు. యూనియన్ డిస్కం కార్యదర్శి ఎల్.రాజు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకొని, కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేయాలని కోరారు. మరో 6 నెలల్లో వేతన ఒప్పందం గడువు ముగుస్తున్న నేపథ్యంలో పిఆర్‌సి కమిటీ నియమించాలని, కార్మికులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిస్కం కమిటీ ట్రెజరర్ యం.సి.హెచ్.వీరాంజనేయులు, డిస్కం, రీజనల్ నాయకులు ఎన్.శ్రీనివాసరావు, రాంబాబు, ఖాసింవలి, సుబ్రహ్మణ్యం, శివనాగేశ్వరావు, గాలిబ్, నాయక్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యలో సమగ్ర మార్పులు అవసరం

(మొదటి పేజీ తరువాయి)

టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు కోరుతూ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు, క్లోజర్లు జాప్యం లేకుండా వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు కోశాధికారి ఎమ్‌డి.దౌల, కార్యదర్శి సి.హెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, టి.ఆంజనేయులు, ఎమ్‌డి.షకీలాబేగం, ఎం.గోవిందయ్య, కేదార్నాథ్, కె.కామాక్షి, కె.రంగారావు, బి.ప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ అడవి శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ సభ్యులు కె.ప్రేమ్‌కుమార్, ఎం.కోటిరెడ్డి జి.జితేంద్ర పాల్గొన్నారు.

తుపాను నేపథ్యంలో వరి, పత్తిలో యాజమాన్య చర్యలు అవసరం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



మండల వ్యవసాయాధికారి బి.కిషోర్

మొంథా తుపాను నేపథ్యంలో పత్తి, వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక వర్షాల నుండి పంటలను కాపాడుకోవడానికి తగిన యాజమాన్య పద్ధతుల చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.కిషోర్ సూచించారు. వరి పైరు ముంపునకు గురైతే.. పైరు పొట్ట దశలో ఉంటే ముందుగా ముంపు నీటిని వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపాలన్నారు. వాలిపోయిన వరి పైరును నాలుగు ఐదు దుబ్బులు కలిపి కట్టి పైరును నిలబెట్టాలని, పైరుకు పాముపొడ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్న దృష్ట్యా నివారణకు ప్రాఫికొనాజోల్ ఎకరాకు 200 మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ ఎకరాకు 480 మిల్లీలీటర్లు లేదా హెక్సాకొనొజోల్ ఎకరాకు 400 మిల్లీలీటర్లు దుబ్బులు తడిచేలా పిచికారి చేయాలని వివరించారు. సుడిదోమ ఆశించే అవకాశం ఎక్కువగా ఉందని, దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే ఇథోఫెన్ ప్రాక్స్ ఎకరాకు 300 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేటు 320 గ్రాములు లేదా పైమెట్రోజిన్ ఎకరాకు 120 మిల్లీలీటర్లు లేదా బిప్రోఫ్యూజిన్ 320 మిల్లీలీటర్లు ఎకరాకు లేదా థయోమిథాక్సిమ్ ఎకరాకు 60 గ్రాములు, మోనోక్రోటోపాస్ 440 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆలస్యముగా నాటిన పంటలో వర్షపు నీరు సాధారణ రకాల్లో ఐదు రోజులు వరదను తట్టుకునే రకాల్లోలో 7-10 రోజులు నీరు నిలిచినట్లయితే నీటిని తీసివేసి పంట పునరుద్ధరణ కోసం ఎకరాకు యూరియా 20 కేజీలు మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 20 కేజీ ఎకరాకు బూస్టర్ మోతాదుగా వేయాలని తెలిపారు.

పత్తి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు

పైరులో వర్షాలకు నీరు నిలిస్తే నీటిని తొలగించి, ఎకరానికి 25-30 కిలోల యూరియా, 10-15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ అదనంగా వేయాలని,



వాతావరణం అనుకులించిన వెంటనే పలుమార్లు అంతర్ కృషి చేయాలని ఏవో సూచించారు. పూత, పిందె, కాయరాలుట నివారణకు నాప్తలిన్ అసిటిక్ యాసిడ్1 మిల్లీలీటర్లను 4.5 లీటర్ల నీటికీ కలుపుకొని ఒకటి లేదా రెండు సార్లు 10-15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. అధిక వర్షాల వలన పైరులో మెగ్నీషియం లోపం వలన ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయని, నివారణ కోసం మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున కలిపి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. కాయకుళ్ళు తెగులు, అకుమచ్చ నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణ జిఆర్ స్కూల్ సమీపంలో ఓ మహిళపై హత్యాయత్నంకు పాల్పడిన కేసులో రౌడీ షీటర్ గోలి రామ ఆంజనేయులును ఆదివారం పట్టణ సిఐ కె.వీరాస్వామి అరెస్ట్ చేశారు. పాత మంగళగిరి మునుసుబు వీధికి చెందిన దుర్గ అనే మహిళ ఇంటి వద్ద బట్టలు అరేసుకునే విషయంలో గోలి రామాంజనేయులుకు మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దుర్గ ఒంటరిగా ఉన్న సమయంలో కట్టింగ్ బ్లేడ్‌తో ఆమె తలపై దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడ్డాడు. బాధితురాలిని చికిత్స నిమత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుణ్ణి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లుగా పోలీసులు తెలిపారు. నిందితుడిని గుంటూరు సబ్ జైలుకు తరలించాన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్స్

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ

సిఐటియూ ఆధ్వర్యంలో బస్సు ప్రమాద మృతులకు సంతాపం



మృతులకు నివాళులు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పెదకాకాని

సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులు ఈనెల 24వ తేదీ వేమూరి కావేరి ట్రావెల్స్ బస్ ప్రమాదంలో మరణించిన ప్రయాణికులకు నివాళులు అర్పించారు వారి కుటుం బాలకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఈ సందర్భంగా కె.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడ రేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లా డుతూ వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో 19 మంది చని పోవడం బాధాకరమన్నారు. వాస్తవంగా ఈ స్లీపర్ కోచ్ బస్సులకి ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో పర్మిషన్ లేదనీ, రెండ వది ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో రోడ్డు టాక్స్ ఎక్కువగా, ఇతర కేంద్ర పాలిత రాష్ట్రాలలో తక్కువ ఉండటం వల్ల అక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకుని తెలుగు రాష్ట్రాలలో ఈ బస్సులు విచ్చలవిడిగా నిబంధనలకు వ్యతిరేకంగా తిప్పు తున్నా''ని విమర్శించారు. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలు తిరగ కూడదని చట్టాలు ఉన్నా మైనర్లు రికార్డు ఫోర్సులో లేని వాహనాలు తాగి డ్రంకెన్ డ్రైవ్ చేస్తు విన్యా సాలు చేస్తుంటే అడ్డుకట్ట వేసే నాథుడే లేరన్నారు. ఇప్పటికైనా పాలకులు కర్నూలు జిల్లా లో జరిగిన ఘటన నుండి పాఠాలు నేర్చుకోవాలి మైనర్లు బైకులు నడపకుండా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.ఆర్టిసి ప్రజా రవాణా బలోపేతం చేయాలి ప్రజల ప్రాణాలు కాపాడాలి అన్నారు. కె.లక్ష్మీనారా యణ, ఎస్.సుబ్బారావు, కె.పూర్ణరెడ్డి,వి.యేసు, ఎస్డి మహ మ్మద్, పి.శ్రీను, టి.నాగయ్య, పి.కిరణ్, ఎం.ఆంజనేయులు, వై.నరేష్, జి.సతీష్, వేణు, వి.రమేష్, కె.గోపి పాల్గొన్నారు.

రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ పరిపాలన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ పరిపాలన కొనసాగు తోందని బిసివై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.రామచంద్ర యాదవ్ అన్నారు. ఆదివారం మంగళగిరి ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన పూర్తి గా గత ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి పాలన కంటే పది రెట్లు ఎక్కువగా వ్యవస్థలను నాశనం చేస్తోందని విమర్శిం చారు. రాష్ట్రంలో పోలీసు శాఖను టిడిపి విభాగం మార్చి వేసిందన్నారు. పోరాటం చేస్తున్న తనపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. రానున్నకాలంలో ఇదేవిధంగా చంద్రబాబు నాయుడు పరిపాలన చేస్తే రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రజాశక్తి - తెనాలి

భారీ వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు చెప్పారు. రైతుల నుద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడుతూ పొలాల్లోని అదనపు నీటిని బయటకు పంపుకోవాలని, వాలిపోయిన వరి పైరును నాలుగైదు దుబ్బులు కలిపి కట్టి పైరు నిలబెట్టాలని చెప్పారు. ఆ విధంగా చేసిన వరి పైరుకు పాముపొడ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉందనీ, నివారణకు ప్రొఫికొనాజోల్ ఎకరాకు 200 మి.లీ లేదా వాలిడామైసిన్ ఎకరాకు 480 మి.లీ పిచికారి చేయాలని తెలిపారు. పైరులో సుడిదోమ ఆశించే అవ కాశం ఎక్కువని, దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే ఇథో ఫెన్‌ప్రాక్స్ ఎకరాకు 300మి.లీ పిచికారి చేయాలన్నారు.

వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర

ప్రజాశక్తి - మేడికొండూరు

విద్యా వైద్య రంగాలను ప్రైవేటు పరం చేసి నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత సేవలు అంద కుండా కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మేడి కొండూరు మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీన నిర్వహించ బోయే ప్రజాఉద్యమ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు ను పేరేచర్ల సెంటర్లో మేడికొండూరు మండల నాయ కులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. తాళ్లూరు వంశీకృష్ణ మాట్లాడుతూ రూ. కోట్ల ప్రజా ధనంతో నిర్మిం చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి లాభపడేలానే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రబ్బాని, పేరేచర్ల గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ సుభాని, కొరివి కిషోర్, ముత్యాల బాలస్వామి, గండికోట రసూలు, ఉడత శ్రీనివాసరావు, అబ్బాస్, గోపి దేశి శ్రీను, లూర్దు రాజు, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఫిరంగిపురం

ప్రభుత్వ వైద్య కళాశాలను పిపిపి పేరుతో ప్రైవేటీ కరణ చేయడాన్ని వైఎస్ఆర్‌సిపి తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) డిమాండ్ చేశారు. సంతకాల సేకరణల కార్యక్రమం భాగంగా మండలంలోని వేములూరుపాడు, ఫిరంగిపురంలోని వసంత నగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు పాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో టిడిపికి చెందిన కార్యకర్తలు వైసిపి నాయకుడు అవిబుల్లా ద్వారా డైమండ్ బాబు ఆధ్వర్యంలో వైసిపీలో చేరారు. కార్యక్రమంలో మం డల వైసిపీ నాయకులు మార్పులు శివారామిరెడ్డి, దాసరి కత్రినమ్మ, హేమలత రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అమర్లపూడి రత్నం, కమలారెడ్డి, సయ్యద్ సైదులు (బుడే), దండే వెం కట్రావు, బొంబాయి శ్రీనివాస్‌రెడ్డి, వేలంగిని, మరియా కుమారి, చుక్క మీనాక్షి, షేక్‌మస్తాన్‌బి పాల్గొన్నారు.

తుపానుపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - తాడికొండ

మొంథా తుపాను నేపథ్యంలో మండల అధికారులు ఆదివారం మండలంలోని పొన్నెకల్లు గ్రామంలో చౌడే శ్వరి ఆలయం ప్రాంతంలో నివసిస్తున్న లోతట్టు ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహశీల్దార్ మెహర్ కుమార్ ఎండిఓ సమతా వాణి ప్రజలకు సూచించారు. బాలయోగి గురుకుల పాఠశాల వసతి గృహమును ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ వసతి గృహాన్ని పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, వారి పని ప్రదేశాల్లో పరిస్థితి లో ఎప్పటికప్పుడు పైఅధికారులకు తెలియజేయాలని తహసీల్దార్, ఎండిఓ పంచాయతీ కార్యదర్శులకు విఆర్వోలకు ఇతర ప్రభుత్వ అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు పాల్గొన్నారు.

అజయ్‌కి అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం



సత్కారం అందుకుంటున్న అజయ్‌కుమార్ దంపతులు

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల యాపిల్ విద్యా సంస్థల వ్య వస్థాపకులు అజయ్ కుమార్‌కు ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ పురస్కారం వరించింది. 25ఏళ్ళుగా విద్యారంగంలో విశేష కృషి చేస్తూ ఎంతోమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించారు. ఆదివారం గుంటూరు రెవిన్యూ కళ్యాణ మండపంలో అజయ్‌కుమార్ ఈఅవార్డును అందు కున్నారు. సౌత్‌రన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ అవార్డును ప్రదానం చేసింది. అజయ్‌కుమార్, శాంతి దంపతులను దశ్శాలువతో సత్కరించి పూలమాల వేసి అవార్డును అందించారు. కార్యక్రమంలో సౌత్రన్ లెక్చరర్స్ టీచర్స్ ప్రైవేట్ ఆర్గనైజేషన్ సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే గోవిందరాజులు, రాష్ట్ర మీడియా ప్రెసిడెంట్ ఎన్ వి ఎస్ రఘు ప్రదీప్, రాష్ట్ర కన్వీనర్ పి రాజారత్న కుమార్. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి విల్సన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్.అన్ని సుస్మిత పాల్గొన్నారు. అజయ్ కుమార్ దంపతులకు పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు, ఆపిల్ విద్యా సంస్థల యాజమాన్యం, ఉద్యోగులు, తల్లితండ్రులు అభినందనలు తెలియజేసారు.

వైసిపి పదవులకు పలువురు రాజీనామా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో ప్రత్తిపాడు వైసిపి జడ్‌పిటిసి విప్పాల కృష్ణారెడ్డి, వారితో పాటు ఐదుగురు ఎంపిటిసీలు, వివిధ పార్టీ పదవులకు నాయకులు ఆదివారం రాజీనామా చేసి జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబుకి అందజేశారు. శనివారం రాజీనామా చేస్తామని వారు అంబటి రాంబాబు చెప్పినపుడు మీకు 24 గంటల్లో న్యాయం చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో వారు విరమించారు. ఆదివారం వరకు ఆయన స్పందించకపోవడంతో రాజీనామా పత్రాలను అంబటికి అందజేశారు. వారు మాట్లాడుతూ 2021, సెప్టెం బర్ 24వ తేదీన ఎంపిపి. ఎన్నిక ఒప్పందం పార్టీ పెద్దల ఆదేశాల మేరకు జరిగిందన్నారు. ఆసమయంలో మొదటి రెండేళ్ళ దాసరి అన్నమ్మ తరువాత రెండేళ్ల బూసి సువార్తమ్మ అని అగ్రిమెంట్ రాసుకున్నారని చెప్పారు. కాని దాసరి అన్నమ్మ ఒప్పందం ప్రకారం తప్పుకోలేదన్న విషయం ప్రత్తి పాడు నియోజకవర్గ ఇంచార్జి బలసాని కిరణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. తరువాత జిల్లా అధ్యక్షులు వద్దకు, రీజినల్ కో-ఆర్డినేటర్, పార్టీ పెద్దలకు ఈ విషయం తెలిపా మన్నారు. అయినా వారిని కూడా దాసరి అన్నమ్మ ఖాతరు చేయలేదన్నారు. తమకు పార్టీలో న్యాయం జరగకపోవడంతో వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని తెలు పుతూ జిల్లాపార్టీ అధ్యక్షులు అంబటికి పత్రాలు అందజేశారు.



రాజీనామాపత్రం అందజేస్తున్న జెడ్‌పిటిసి విప్పాల కృష్ణారెడ్డి

రాజీనామా చేసిన మిగతా వారి వివరాలు

పదవులకు రాజీనామా చేస్తున్న ప్రత్తిపాడు ఐదుగురు ఎంపిటిసీలు 1)బి.సువర్తమ్మ, 2)ఎన్.స్వప్న, 3) జీ.సాయి,4) వి .మాణిక్యారావు,5)ఎం సురేష్ బాబు ఒక కో ఆప్షన్ నెంబర్ షేక్.వసీం నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్ వసిమల్ల సన్నీ,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బాపతు వెంకటేశ్వర రెడ్డి, జిల్లా యాక్టివిస్ట్ కార్యదర్శి సి హెచ్ లక్షణ, కొత్త మల్లయ పాలెం వైస్ ప్రెసిడెంట్ ఉస్సేపల్లి చైతన్య రెడ్డి ,బూతు కమిటీ అధ్యక్షుడు ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి కూడా రాజీనామా పార్టీ సభ్యత్వానికి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తెనాలి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బుర్రిపాలెం కు చెందిన తురుమెళ్ళ బెనర్జీ రిథమ్ ప్యాడ్ ప్లేయర్. పొన్నూ రు మండలంలో ప్రోగ్రాంకు వెళ్లి తిరిగి వస్తుండగా తెనాలి సమీపంలో వెనుక నుండి వచ్చిన టాటా ఏస్ వాహనం బైక్‌ను ఢీ కొట్టి వెళ్లడంతో బెనర్జీతో పాటు వెనుక ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి యజమానిపై కేసు నమోదు

వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని అమరావతి ప్లాట్స్‌కు చెందిన గృహిణి సుప్రజ, తనతో ఇంటి యజమాని అసభ్యంగా ప్రవర్తించాడంటూ త్రీటౌన్ పోలీసు లను ఆశ్రయించగా ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

రైలులో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

రైల్లో చోరీకి పాల్పడిన యువకుడిని జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడి ల్యాప్‌టాప్ బ్యాగ్ శనివారం తెల్లవారుజామున అపహరణకు గురైంది. బాధితుడు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ జి. వెంకటాద్రి దర్యాప్తు చేశారు. నిందితుడిని కడప జిల్లా శెట్టిగుంటకు చెందిన శ్రీరామ్ మహేష్‌బాబుగా గుర్తించి ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడు గతంలో పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

నేడు పోలీసు గ్రీవెన్సు రద్దు

గుంటూరు జిల్లా ప్రతినిధి : మొంథా తుఫాన్ దృష్ట్యా సోమ వారం జరిగే గ్రీవెన్సును తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితు ల్లో సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112 నంబర్ ద్వారా వెంటనే పోలీస్ సహాయం పొందవచ్చని తెలిపారు.

అధికారులూ అప్రమత్తంగా ఉండండి

సమీక్షా సమావేశంలో స్పెషల్ అధికారి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మొంథా తుఫాన్ ప్రభావం మండలంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఆదివారం ప్రత్తిపాడు మండల కేంద్రంలో ఏంపిడిఓ కార్యాలయంలో మండల స్పెషల్ అధికారి బి.రవీం ద్ర బాబు (జిల్లా ఉద్యానవన శాఖ) ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ అధికారులంతా అప్రమత్తంగా ఉండా లనీ, మండలంలో మొంథా తుఫాన్ ప్రభావ సహాయక చర్య ల్లో పాల్గొనాలని తెలిపారు. వాగులు పొంగే ప్రాంతాలు, ముంపుప్రాంతాలను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎంపీడీఓ కె.శివపార్వతి మాట్లాడుతూ పంచాయతీ అధికారులు ఆయా పంచాయతీలో ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. తహశీల్దార్ జి.సుజాత మాట్లాడుతూ మండల స్థాయి అధికా రులు అప్రమత్తంగా ఉండి తుఫాన్ ప్రభావం సహాయక చర్య లు ముందుండాలి అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ దినకర్, ఏంఈఓ రమాదేవి, ఆర్.డబ్ల్యు.ఎస్ ఏఈ వినీల్, విఆర్ఓలు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరానికి తరలి వచ్చిన వృద్ధులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆది వారం రూరల్ గ్రామం బుర్రిపాలెంలోని ఎస్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహిస్తున్న శిబిరంలో భాగంగా రోగులకు రక్త పరీక్షలు, ఇసిజి పరీక్షలు చేశారు. షుగర్‌వ్యాధిపై అవగాహన కల్పించారు. తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిం చారు. షుగర్ నియంత్రణకు శారీరక వ్యాయామం అవసరమని చెప్పారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమం లో వాలంటీర్స్, కోఆర్డినేటర్ ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను భారీ వర్షాలు కారణంగా ఈ నెల 27న సోమవారం రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.



వృద్ధుని మృతదేహం

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి విజయవాడ రైలు మార్గంలో చిలువూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి గుర్తు తెలియని మృత దేహం ఉన్న సమాచారంతో రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీ లించారు. మతుని వయస్సు 55 నుంచి 60 సంవత్స రాల మధ్య ఉండవచ్చునని, రైలు ఢీకొనడంతో మృతి చెంది నట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మృతదేహం ఆనవాళ్ళు గుర్తించిన వారు జిఆర్‌పి ఎస్ఐ జి.వెంకటాద్రిని సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కనీస వేతనాల్లేని కార్మికులు ఎలా బతకాలి?

- ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
- వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగానూ పోరాడతాం
- ముగిసిన సిఐటియు పల్నాడు జిల్లా మహాసభ
- 46 మందితో నూతన కమిటీ - అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బండ్ల మహేష్, ఎస్.ఆంజనేయులు నాయక్

పజాశక్తి-పిడుగురాళ్ల

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే సిఐటియు లక్ష్యమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరావు అన్నారు. పట్టణంలలోని పిలుట్ల రోడ్డు నందు గల టిఎస్ రెడ్డి డిగ్రీ కళాశాలలోని కాంద్రకుంట సీతారామయ్య ప్రాంగాణం నందు సిఐటియు పల్నాడు జిల్లా 2వ మహాసభ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ కార్మిక ర్యాలీ చేశారు. అనంతరం ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ముగింపు సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరావు, ముజఫర్ ఆహ్మద్ మాట్లాడారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు మనుధర్మం పేరుతో దేశాన్ని వందేళ్లు వెనక్కి తీసుకువెళుతున్నారని అన్నారు. ధరలేమో ఆకాశాన్ని తాకుతుంటే వేతనాలు కిందకి దిగిపోతున్నాయని, దేశంలో సుమారు 41 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యంలో ఉన్నా నాయకులుకు పట్టడంలేదని విమర్శించారు. దేశంలో ఆకలి చావులు, నిరుద్యోగం పెరిగిపోయాయని అన్నారు. స్కీమ్ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలకు, విఆర్‌వోలు, విఏవోలుకు జీతాలు సరిగా చెల్లించడం లేదని అన్నారు. కార్మికులను, ఉద్యోగులను బానిసలుగా చేసేందుకు లేబర్ కోడ్‌లు తెచ్చారని విమర్శించారు. జిఎస్‌టి తగ్గించామని చెబుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంపు గురించి ఎందుకు మాట్లడటంలేదని, రాష్ట్రానికి రావాల్సిన జిఎస్‌టి వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నాలుగు డిఎలుకు ఒక డిఎ ఇచ్చినా మిగిలినవి ఎప్పుడు ఇస్తారని, జీతాలు ఎప్పుడు పెంచుతారని నిలదీశారు. విద్యుత్ ఛార్జీలు పెంచారని, మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పజెబుతున్నారని, దీనివల్ల పేదలకు, మధ్యతరగతలకు వైద్య విద్య దూరం అవుతుందని అన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని అనేక రకాల కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని రూ.10-11 వేల జీతాలతో ఎలా బతకాలని ప్రశ్నించారు. తెలంగాణలో సిఐటియు ఉద్యమాలతో అంగన్‌వాడీలకు జీతాలు పెంచారని, ఇక్కడ జీతాలు పెంచాలంటే డబ్బుల్లేవంటున్నారని, సిఎం, డిప్యూటీ సిఎం రోజూ హైదరాబద్‌కు విజయవాడకు ఎవరి సొమ్ముతో తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు జీతాలు, పెన్షన్లు పెంచుతామంటున్నారని, మరి 20-30 ఏళ్లు సేవ చేసిన ఉద్యోగులకు జీతాలు ఎందుకు పెంచరని అడిగారు. 13 గంటల పని విధానం వల్ల ఉద్యోగులకు ఆనారోగ్యం వస్తే ఎవరు భాద్యులని, రాత్రి పూట మహిళా ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సిఐటియు పల్నాడు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అధికారం మారినప్పుడుల్లా ఉద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులపై మానుకోవాలని, కార్మికుల మౌలిక వసతులు కల్పించాలని, పంటలకు మద్దతు ధరల కోసం చట్టాలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ అంశాలపై మహాసభలో తీర్మానాలను ఆమోదించినట్లు చెప్పారు.

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో 46 మందితో సిఐటియు పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బండ్ల మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆంజనేయులు నాయక్, కోశాధికారిగా మెగిలి హరిపోతురాజు, 18 ఆఫీస్ బేరర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుంటూరు విజయకుమార్, డి.శివకుమారి, బందగి సాహెబ్, తెలగపల్లి శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ర్యాలీలో కార్మికులు, నాయకులు





నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన బండ్ల మహేష్, ఎస్.ఆంజనేయులు నాయక్, కోశాధికారి మొగిలి హరిపోతురాజు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

260 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - యడ్లపాడు

జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో 'బాసట' ఆధ్వర్యంలో స్థానిక పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. షుగరు, బిపి, ఫిట్స్, పక్షవాతం సంబంధించిన 260 రోగులను డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ, డాక్టర్ సొంటినేని భవ్యశ్రీ పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులిచ్చారు. బాసట అధ్యక్షులు ఎన్.కాళిదాసు, ట్రెజరర్ కె.రామబ్రహ్మం, సభ్యులు పి.శ్రీనివాసరావు, ఆర్.సురేష్, ఎం.వేణు, బి.రాజేష్, జి.కిరణ్, కె.రామోజీ, సిహెచ్.రంగారావు, ఎం.ధర్మతేజ, నారాయణ హైస్కూల్ విద్యార్థినులు వాలంటీర్లుగా సేవలందించారు. రిటైర్డ్ లెక్చరర్ రావూరి దేవయ్య భోజనాన్ని సమకూర్చారు.



అవార్డు ప్రదానం అనంతరం సత్కారం పొందుతున్న నాగిరెడ్డి

అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు-2025ను అందుకున్న నాగిరెడ్డి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణానికి చెందిన ఏపీపియుఎస్ ఎంఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు, లిటిల్ ఏంజెల్ స్కూల్ డైరెక్టర్ భవనం నాగిరెడ్డికి ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు-2025 ప్రదానం చేశారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రంలో అవార్డును నాగిరెడ్డి అందుకున్నారు. సదరన్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును నాగిరెడ్డికి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అందించి సత్కరించారు. నాగిరెడ్డికి సత్తెనపల్లి నియోజకవర్గ గౌరవాధ్యక్షులు వి.సుబ్బారాయుడు, అధ్యక్షులు కెఎస్‌కె మహబూబ్ సుభాని, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.శివకుమార్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు బి.హనిమిరెడ్డి, వివిధ పాఠశాలల డైరెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు.

వివేకా కృష్ణారెడ్డికి అబ్దుల్ కలామ్ అవార్డు

ప్రజాశక్తి - రెంటచింతల

ఎందరో విద్యార్థుల బంగారు భవితకు మార్గం సుగమం చేసి బాటలు వేసిన వివేకా కృష్ణారెడ్డి అబినందనీయుడని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కెఎస్. లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డును సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారు కృష్ణారెడ్డికి ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఎస్‌పిఎల్‌టిఒ అధ్యక్షులు డాక్టర్ నాగయ్య అధ్యక్షత వహించారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వెనకబడిన పల్నాడులో విద్యాభివృద్ధికి కృష్ణారెడ్డి చేస్తున్న కృషి చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్ హుస్సేన్, జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, కౌండిన్య ఎడ్యుకేషన్ అధ్యక్షులు వివి.నారాయణ, దేశవ్యాప్తంగా అవార్డును పొందిన 90 మంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తికి చంద్రబాబు, లోకేష్ రాక

ప్రజాశక్తి - వెల్దుర్తి, మాచర్ల

మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి వివాహ రిసెప్షన్ సోవారం జరగనుండి. వేడుకలకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక టిటిడి కళ్యాణ మండపం ఎదురు దాదాపు పదెకరాల్లో భారీ ఏర్పాట్లు చేస్తుండగా ఎమ్మెల్యే పర్యవేక్షించారు. టిడిపి నాయకులు ఎం.చినవెంకటరామిరెడ్డి, కె.సైదయ్య, జె.చిరంజీవిరెడ్డి, వెంకటరెడ్డి, అక్కిరెడ్డి, పాపిరెడ్డి, కె.హనిమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : పల్నాడు ఎస్పీ

సిఎం రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలీప్యాడ్ గ్రౌండ్‌ను, రిసెప్షన్ జరిగే స్థలాన్ని, భోజన ఏర్పాట్ల స్థలం వద్ద ఏర్పాట్లను పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం సందర్శించి ట్రైల్ రన్ నిర్వహించారు. బందోబస్తుకు సంబంధించి మాచర్లలోని మానుకొండ కళ్యాణ మండపంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సిఎం పర్యటనలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ సంతోష్, ఎ.ఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, క్రైమ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, గురజాల ఇన్‌ఛార్జి డిఎస్పి వెంకట రమణ, ఎస్బి సిఐ సురేష్‌బాబు, ఇతర డీఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



సిఎం పర్యటన భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, సిబ్బందికి సమావేశంలో సూచనలిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు

తుపాను నేపథ్యంలో అప్రమత్తం

ప్రజాశక్తి - వినుకొండ:

మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జివి ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. తుపాను కారణంగా సంభవించే ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తుపాను సమయంలో ఎవరూ బయటకు రావొద్దని, అధికారులు, విపత్తు నిర్వహణ సిబ్బంది ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తి - రెంటచింతల

తుపాను కారణంగా రానున్న మూడ్రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ మేరి కనకం కోరారు. పొలం వెళ్లిన వారు వర్ష సమయంలో చెట్ల కింద ఉండొద్దన్నారు.

ప్రజాశక్తి-దాచేపల్లి

తుపాను నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అవసరం ఉంటేనే బయటకు రావాలని, అత్యవసర సహాయం కోసం 9948206636 నంబరును సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

తుపాను నేపథ్యంలో మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఎంఇఒ-1 ఎం.నాగరత్నం తెలిపారు. ఎవరైనా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వమించారు. ప్రమాదాలను ముందస్తుగా అంచనా వేసి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు స్థానిక నాయకుల సహకారంతో సహాయ కార్యక్రమాలను చేపట్టాలని, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ధనలక్ష్మి కోరారు. సోమ, మంగళ, బుధవారాల్లో అనవసరంగా బయటకు రావొద్దన్నారు. అత్యవసర సమాయాల్లో సహాయార్థం తమ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, అవసరమైన వారు 7661048779, 9949098618 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నిండా మునిగిన నిమ్మ, సపోటా రైతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలు ఏమిటి పండించిన పంటకు ధర లభిస్తుందా ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే పరిహారం లభిస్తుందా కష్టపడి పని చేస్తున్నా రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అందుతున్నాయని నిమ్మ సపోటా రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని చిలువూరు పరిసర గ్రామాలలో నిమ్మ , సపోటా తోటలు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోటలలో నీరు బయటకు వెళ్లే మార్గం లేక చేలు చెరువులను తలపిస్తున్నాయి. దీనితో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఒక ప్రక్క పండించిన పంటకు ధర లేదు మరో ప్రక్క దిగుబడిపోయి తీవ్ర ప్రభావం క్రమం తప్పకుండా ఏర్పడుతున్న వాయు గుండాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. చిలువూరు గ్రామం నుండి కంతంరాజు కొండూరు గ్రామానికి వెళ్లే రహదారికి ఇరుపక్కల తోటలు ఎక్కువగా ఉన్నాయి. రోడ్డుకు ఇరుపక్కల మురుగు కాలువలు ఉన్నప్పటికీ రైతులు చేలకు వెళ్లేందుకు బాటలు వేశారు. కొన్నిచోట్ల తూములు వేసినప్పటికీ అవి పగిలిపోవటము లేదా పూడిపోవటము జరిగినది. దీనితో చేలలో నీరు బయటకు వెళ్లే మార్గం లేక చేలు మురుగు నీటి లో నానుతున్నాయి. ఈ ప్రాంతంలో నిమ్మ తోటలు అధికంగా కౌలు రైతులే సాగు చేస్తున్నారు. వారి పరిస్థితి మరీ దమనీయంగా మారినది. రూ. లక్ష కౌలు ముందే చెల్లించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చాలా చేలలో కాయలు వ్రాలిపోయి నీటిలో కంగిపోతు న్నాయి. మరో ప్రక్క కష్టపడి పంట కోసినప్పటికీ గిట్టుబాటు ధర లేదు కేజీ రూ.20 పలుకుతున్నట్లు రైతులు తెలిపారు. దీనితో కూలీ రవాణా ఖర్చు మార్కెట్ కమిషన్



నీరు నిల్వ ఉండటంతో చనిపో తున్న సపోటా చెట్లు

సరిపోతుందని, ఏమీ మిగలదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేలలో నీరు ఇప్పటిలో తగ్గే అవకాశాలు లేనట్లే కనిపిస్తున్నాయి. మరోపక్క మొంథా తుపానుతో భారీ వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరుపక్కల ఉన్న కాలువలు పూడికలు తీసినట్లైతే సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందంటున్నారు.

పదేళ్లగా కష్టపడుతున్నాం



పఠాన్ నాగుల్ మీరా, కౌలు రైతు, చిలువూరు

నిమ్మ తోట గాలిలో దీపం లాంటిది. గాలి వీచిన అధిక వర్షాలు కురిసిన పెట్టిన పెట్టుబడి చేసిన కష్టం నీళ్ల పాలు అవుతుందన్నారు ఈ కౌలు రైతు. 10 సంవత్సరాలుగా నిమ్మ తోటలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న ఒక్క రూపాయి కూడా వెనుక వేసుకోలేదు ఒక్క సంవత్సరం లాభాలు వచ్చినప్పటికీ రెండవ సంవత్సరం మొత్తం కొట్టు కుపోతుంది. లాభం వచ్చిన సంవత్సరం కౌలు రైతులు పోటీలు పడి కౌలు పెంచేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. తుపాను తీవ్ర రూపం దాల్చి అధిక వర్షాలు తీవ్ర గాలులు గాలులు వీచినట్లయితే తీవ్రంగా నష్టపోతామన్నారు.

పెద్దలకు సబ్సిడీలు.. మాకు ఇక్కట్లు



పెద్దు విద్యాసాగర్, రైతు చిలువూరు

పారిశ్రామికవేత్తలకు అనేక విధాలుగా సబ్సిడీలు ఇస్తున్నారు రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని భరోసా లేదని ఈ రైతు తెలిపారు. నిమ్మ చెట్లు అధిక తేమను తట్టుకోలేవు దీని ప్రభావం పూత పిందె పై పడి దిగుబడి తగ్గుతుం దన్నారు. ఎండకు ఎండి వానకు తడిసి కష్టపడుతున్న వ్యవసాయం లాభసాటిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డ్రైనేజీ కాలువలు బాగు చేయించాలని కోరారు.

7 నుండి వివిఐటియు బాలోత్సవ్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

నంబూరు లోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ (వివిఐటియు) ప్రాంగణంలో బాలోత్సవ్ బి2025 ఈ ఏడాది నవంబర్ 7 నుండి 9 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. బాలోత్సవ్ సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన ప్రచార ప్రతులను ఆదివారం ఆయన విడుదల చేసారు. ఈ సందర్భంగా గుజ్జనగుండ్ల లోని యూనివర్సిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవ్ ఒక వేదికని, ఇది వివిఐటియు నిర్వహించే 7 వ బాలోత్సవ్ అని, విద్యార్థులలోని ఒత్తిడిని దూరం చేసి ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలగచేయటానికి బాలోత్సవ్ దోహదపడుతుందన్నారు. 2017 నుండి నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో పాల్గొను విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా రెట్టింపు అవుతుందన్నారు. గత బాలోత్సవంలో రోజు పదివేల మంది బాలబాలికలతో వేడుకలు నిర్వహించామని ఈ సంవత్సరం అంతకన్నా అధికంగా విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ బాలోత్సవ్ ద్వారా తెలుగు సంస్కృతి, సాంప్రదాయం, విశిష్టత, ప్రాముఖ్యతను భావి తరాలకు తెలియపరచవచ్చని అన్నారు. వివిఐటియు రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో పోటీతత్వం, నైపుణ్యం పెంపొందించేందుకు వివిఐటియు బాలోత్సవ్ కృషి చేస్తున్నదని, విద్యార్థులకు సాంస్కృతిక అంశాలతోపాటు, సాంకేతిక అంశాలలో కూడా బాలోత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. ఎన్.సి.సి, శాఖ విద్యార్థులు బాలోత్సవ్ పాల్గొని చిన్నారులకు సహకారం అందిస్తారని తెలిపారు. వివిఐటియు బాలోత్సవ్ విద్యార్థి సంధానకర్త టి.నవ్య మాట్లాడుతూ మూడు రోజులపాటు 20 అంశాలు 60 విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించనున్నామని, ప్రతి విభాగములోను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు మరియు రెండు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో వక్తృత్వం, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం. శాస్త్రీయ, జానపద నత్యం, సంగీతం వంటి సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి ఈ వేడుకలకు విచ్చేయువారికి ఉచిత వసతి మరియు భోజన సౌకర్యము కల్పించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు www.balotsav.in వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకున్న ఎంట్రీ ఫారాలను పూర్తిచేసి పోస్టు ద్వారా పంపవచ్చు లేదా వెబ్సైట్లో లోని గూగుల్ ఫారంను పూర్తిచేసి సబ్మిట్ బటన్ నొక్కటం ద్వారా అప్లోడ్ చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బాలోత్సవ్ సంధానకర్త నందిరాజు శివరామకృష్ణను 73862 25336 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. డిప్యూటి రిజిస్ట్రార్ డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవ్ ప్రతులు ఆవిష్కరిస్తున్న వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆలిండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏపీ శాఖ త్రైవార్షిక సమావేశాలు రెండవరోజు ఆదివారం ప్రతినిధుల సభ గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిం చారు. కార్యక్రమానికి ఎం.ఉమామ హేశ్వరరావు అధ్యక్షత వహిం చారు. నిమ్మగడ్డ నాగేశ్వరరావు ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించారు. కోశాధికారి సిహెచ్.హను మంతరావు ప్రవేశపెట్టిన నివేదికను సభ ఆమోదించింది. అనంతరం రాబోయే మూడు సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.రాజారావు, జనరల్ సెక్రెటరీగా నిమ్మగడ్డ నాగేశ్వరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా కె.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఏ.వెంకట ప్పయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జే.రామసుబ్బయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహాసభల విజయవంతానికి కషి చేసిన బి.సుబ్బారావు సిహెచ్. విద్యాసాగర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రూప్ సి అసిస్టెంట్ రాష్ట్రకార్యదర్శి కార్యదర్శి మెట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలి

ప్రజాశక్తి - పెదకాకాని

అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేయాలని లేని పక్షంలో ఆందోళనకు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70 శాతం భూమిని నిరుపేద కౌలు రైతులే సాగు చేస్తున్నారని, అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పంట పండిస్తున్నారన్నారు. కౌలు రైతులకు భూ యాజమాని సంతకంతో పని లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసి పంట నష్ట పరిహారాలు, ఎరువులు, పురుగు మందులు కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వరి పంటకు రెండు మూడుసార్లు తిరిగి నాటుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, పత్తి పంట పూత, పిందె రాలి దిగుమతి ప్రమాదంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సేవ కేంద్రాలలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలం నుండి వెళ్లే కాల్వ కట్టలు తెగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాల్వ కట్టలు మరమ్మతులు చేసి వరదనీరు పొలాల్లోకి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు కాలనీలో వరద నీరు చేరకుండా చర్యలు తీసుకొని ఆ కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న అలీ రఫర్ కాలనీలో అర్హులైన పేదలందరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. చిన్నపాటి వర్షానికి నంబూరు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంటుందని, తక్షణమే వరద నీరు గ్రామం పై పడకుండా హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, వెంకటరెడ్డి, ఆదాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బలరామకృష్ణమూర్తి తదితరులు

ప్రజావైద్యుడు డాక్టర్ హనుమంతరావు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజల వైద్యుడిగా, మానవీయ విలువలతో జీవించిన డాక్టర్ ముద్దన హనుమంతరావు జీవితం ఆదర్శప్రాయమని మాజీ పార్లమెంటు శాసనసభ సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం భారతి ధార్మిక విజ్ఞానపరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు గ్రంథస్తం చేసిన 'ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతరావు' పుస్తకాన్ని స్థానిక బృందావన్ గార్డెన్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, పద్మావతి కల్యాణ వేదికపై బొల్లేపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు వనమా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సామ్యవాద దృక్పథంతో పాటు భారతీయ సంస్కృతి, చరిత్ర ఆదర్శాలను ఆచరణలో చూపేవారన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు మాట్లాడుతూ ఉన్నత చదువులకు దూరంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన తనలాంటి వారిని వెన్నుతట్టి ప్రోత్సహించిన నిష్కామక కర్మయోగి హనుమంతరావు అని అన్నారు. కార్యక్రమంలో జి.సీతారా మయ్య, డాక్టర్ కె.రవీంద్రనాద్, కె.రామారావు, పి.జ్ఞానదేవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహిత్య

ముగిసిన నేషనల్ ఐపి యాత్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

గత రెండ్రోజులుగా స్థానిక నగరంపాలెం జిటి రోడ్డు, శుభం హెూటల్లో జరుగుతున్న 'నేషనల్ ఐపియాత్ర 2025' ముగిసింది. కెఎల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్, కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ స్కీమ్స్, పేటెంట్, కాపీరైట్, డిజైనింగ్, జియోగ్రాఫికల్, ఇండికేషన్, ఐపిలీగల్, ఫ్రేమ్‌వర్క్, ట్రేడ్‌మార్క్, టెక్నాలజీ ట్రాన్స్ఫర్ అండ్ ఐపి, కమర్షియలైజేషన్ వంటి అంశాలపై నిష్ణాతులతో అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్‌బ్యాంక్ ఎస్ఎంఈ విభాగం చీఫ్ మేనేజర్ సాహిత్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎమ్ఈల ద్వారా అనేక పథకాలు ప్రవేశపెట్టి యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బ్యాంకులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. యువ పారిశ్రామికవేత్తలు సరైన ప్రాజెక్టు రిపోర్ట్స్ రూపొందించుకొని జాతీయ బ్యాంకులను సంప్రదిస్తే సబ్సిడీలతో కూడిన రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. యువ పారిశ్రామికవేత్తలు మూసధోరణులకు భిన్నంగా కొత్తకొత్త ఆలోచనలతో అంకుర పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా మహిళ యువ పారిశ్రామికవేత్తలనో ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీతో వారు ఎంచుకునే వ్యాపారం, పరిశ్రమను బట్టి ఐదు లక్షల నుండి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. సభకు కేఎల్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.రాఘవరావు అధ్యక్షత వహించారు. సదస్సులో ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ అధ్యక్షులు ఏపీకేరెడ్డి, ఎమ్మెస్ ఎంఈ ఫ్యాకల్టీ ట్రైనర్ జె.కోటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి వై.నాగరాణి, బావా డెవలపర్స్ కె.శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

యార్డ్ చైర్మన్ కమిటీ జిల్లా అధ్యక్షునిగా పూనాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మార్కెట్ యార్డ్ కమిటీలను ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు.నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం పల్నాడు జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ల సమావేశం జరిగింది. పల్నాడు జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షులుగా నరసరావుపేట మండలం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు జిల్లా రైతుల ప్రయోజనాల కోసం నూతన కమిటీ అవిశ్రాంతంగా కృషి చేస్తుందని నమ్ముతున్నానన్నారు. మార్కెట్ యార్డుల ద్వారా రైతులకు అవసరమైన సౌకర్యాలు, సమాచారం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొత్తం 12 మార్కెట్ యార్డులకు గాను 10 మార్కెట్ యార్డులకు చైర్మన్ లను కూటమి ప్రభుత్వం నియమించింది. 2 మార్కెట్ యార్డుల్లో చైర్మన్ల ఎన్నిక పెండింగ్‌లో ఉన్నాయి. సమావేశంలో పల్నాడు జిల్లాలోని 10మార్కెట్‌యార్డ్ చైర్మన్లు, సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న డాక్టర్ మురహరిరావు దంపతులు

ఫిజియోథెరపీ పరికరాలు అందజేత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

దివ్యాంగ విద్యార్థులకు ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ ఎస్. మురహరి రావు, కల్పనాదేవి దంపతులు రూ.30వేల విలువైన ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. ఆదివారం పట్టణ శివారు మండాది రోడ్డులోని సూర్యకిరణ్ ప్రత్యేక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరు పాఠశాల డైరెక్టర్ జనార్దన్, ఫిజియోథెరపీ ట్రైనర్ ప్రత్యూషకు ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ జిల్లా డైరెక్టర్ ఇక్కుర్తి శంకర్, లవ్ అండ్ లాఫ్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ మరో రూ.20వేల విలువైన అవసరమైన పరికరాలు అందిచారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోటరీ జిల్లా 3150 డిసీజెస్ అండ్ ప్రివెన్షన్ చైర్మన్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు చేసే సేవ భగవంతుకంటే గొప్పదనీ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్త వహించాలని, దీనికి అవసరమైన నిధులను రోటరీ క్లబ్ ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నారై మెడికల్ కాలేజ్ అడిషనల్ ప్రొఫెసర్ డి. నాగరాజు, క్లబ్ సీనియర్ సభ్యులు చెరుకూరి నరసింహారావు, కె.పి.సిద్ధరాజు, నాగార్జున రెడ్డి, నిమ్మగడ్డ సురేష, కర్నాటి శ్రీనివాసరావు, పఠాన్ నాగూర్ వలి, లవ్ అండ్ లఫ్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 14మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ నిధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వర్షాలతో అధ్వాన్నంగా హైదరాబాద్ రోడ్డు



గుంతలతో ఉన్న నరసరావుపేట నుండి హైదరాబాద్ రోడ్డు

ప్రజాశక్తి- నరసరావుపేట

నరసరావుపేట పట్టణం నుండి హైదరాబాద్ వెళ్ళు ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో జ్యోతి నికేతన్ చెక్‌పోస్ట్ నుంచి రావిపాడు గ్రామం శివారు వరకు పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయింది. హైదరాబాదు, పిడుగురాళ్ల, మాచర్ల, నాగార్జునసాగర్ లాంటి నగరాలకు వెళ్ళుటకు ఈ రహదారి ప్రధాన మార్గం కావడంతో ఈ రోడ్డులో ప్రతినిత్యం కొన్ని వందల వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు మొత్తం చిత్తడిచిత్తడిగా మారి గుంతలతో నిండిపోయి అద్వాన్నంగా తయారయింది. నరసరావుపేట పట్టణం జిల్లా కేంద్రం అవడం వలన పనుల నిమిత్తమై పల్నాడు ప్రాంతం నుండి, నరసరావుపేట పట్టణ పరిసర గ్రామాల నుండి ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఈ రోడ్డులోనే నరసరావుపేట పట్టణానికి ప్రయాణం సాగిస్తుంటాయి. యువకులు వాహనాలపై మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేసే సందర్భంలో రోడ్డుపైన గుంతలు కనిపించక పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్ బి అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి ప్రమాద నివారణకు చర్యలు తీసుకొని ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలను కాపాడండి

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా యాదవుల బజారు వెంబటి నాటిన మొక్కలు విరిగిపోయి చనిపోతున్నాయి. స్వచ్చాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గత నెల 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాచర్లలో పర్యటించారు. యాదవుల బజారులో స్వచ్చాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజలంతా ఐక్యంగా ఆరోగ్యకరమైన వాతావరణం, పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రోడ్డు వెంబటి వున్న గొర్రెల, పశువుల దిబ్బలను తొలగించి, శుభ్ర పరిచి, మొక్కలు నాటారు. మొక్కలకు రక్షణగా ప్లాస్టింగ్ కవచాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డు గుండా రోజూ పశువులు, గొర్రెలు, మేకలు మేత కోసం వెళ్లివస్తూంటాయి. ఆ సందర్భాల్లో గేదెలు, మేకలు వాటి కొమ్ములతో రోడ్డు వెంబటి నాటిన మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రక్షణ కవచాన్ని ధ్వంసం చేస్తుండడంతో సరైన రక్షణ లేక మొక్కలు చనిపోతున్నాయి. ఈ మొక్కలు బతకాలంటే సిమెంట్, ఇనుప రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి.తక్షణం పటిష్ట చర్యలు తీసుకోపోతే నాటిన మొక్కలన్నీ చనిపోయే ప్రమాదం వుందని స్థానికులంటున్నారు.



మొక్కల రక్షణకు ఏర్పాటు చేసిన కవచం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దుద్దు రామకృష్ణ

గవాయిపై దాడి చేసిన వారిని శిక్షించండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయి మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని పలనాడు జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి దుద్దు రామకృష్ణ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడి వెనుక ఉన్న శక్తు లను, వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవా లని కోరారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబరు 1 వ తేదీన చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం చేయాలని తెలియజేశారు. యంఇ ఎఫ్‌జాతీయ నాయకులు దాసరి నాగయ్య మాస్టారు, ఎంఎస్‌పి జిల్లా కోశాధి కారి కంచర్ల జాన్‌బాబు మాదిగ, ఎంఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు వేమవరపు జీవన్ మాదిగ అన్ని మండలాల నాయకులు వెంకటస్వామి, అచ్చయ్య, కృపారావు, కిరణ్, కార్యకర్తలు దయా కర్, నాగరాజు, అశోక్, బాబురావు, శ్రీను, రాజు, సురేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన రాకేష్ కిషోర్ ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ ఒకటిన హైదరాబాద్‌లో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఇంచార్జి దుద్దు రామకృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. నరసరావుపేట పట్టణం స్టేషన్‌రోడ్డులోని విజయ్ రెసిడెన్సి మీటింగ్ హాలులో ఆదివారం ఎంఆర్పీఎస్ నరసరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. రామకృష్ణ, ఎంఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు దాసరి నాగయ్య మాట్లాడుతూ దళితులు ఉన్నత స్థానంలో ఉండడం కొన్ని అగ్రకులాలకు గిట్టడం లేదనీ, దీనికి నిదర్శనమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి అన్నారు. దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు కోటి మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరరావు మాదిగ, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి రాములు మాదిగ, ఎంఎస్పి నాయకులు మల్లవరపు బాబు మాదిగ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వడ్డెర సంఘ నాయకులు

మల్లెల ఈశ్వరరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘం కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వడ్డెర సంఘ కార్పొరేషన్ డైరెక్టర్, మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమర దుర్గారావు కేక్ కట్ చేసి ఈశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొమెర అనంతరాములు, పట్టణ బిజెపి అధ్యక్షులు ఓర్సు క్రాంతి కుమార్, దేరంగుల చెన్నకేశవులు, మంజుల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు(కొట్టు), ఉప్పుతోళ్ల దుర్గారావు, కొమెర శ్రీను, వేములబాలస్వామి, బత్తుల దుర్గారావు, ఉప్పుతోళ్ల చెన్నకేశవులు, బత్తుల కోటి, బత్తుల మల్లికార్జునరావు, దేరంగుల వాసు, దేరంగుల సైదులు, ఉప్పుతోళ్ల కాశయ్య, మల్లెల శ్రీను, బత్తుల వెంకటేశ్వర్లు, కొమెర వసంత రావు, వేముల వెంకట స్వామి పాల్గొన్నారు.



రేకు పాయింటు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఎరువుల రేకు పాయింటు పరిశీలన

ప్రజాశక్తి - నాదెండ్ల

ఎరువుల రేకు పాయింటును పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు నాదెండ్ల మండలంలోని సాతులూరులోని ఎరువుల రేకు పాయింటును ఆదివారం సందర్శించి పల్నాడు జిల్లాకు సంబంధించిన కేటాయింపులను జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు పరిశీలించారు. స్పిక్ యూరియా 1008 మీ, 20.20.0.13 : 437 మీ, 10.26.26: 434మీ.పల్నాడు జిల్లాకి కేటాయించారని తెలిపారు. యూరియా అందుబాటులోనే ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.



ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం

975 మందికి అన్నదానం

ట్రస్ట్ బోర్డు చైర్మన్ శివయ్య

ప్రజాశక్తి - రెంటచింతల

మహాదేవుని అనుగ్రహంతోనే ఏ లోటు లేకుండా అన్నదానం నిర్వహిస్తున్నామని సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ శివయ్య అన్నారు. ఆదివారం కృష్ణానది ఒడ్డున ఉన్న సత్రశాల శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వార్ల ఆలయంలో వరుసగా 5వరోజు 975 మందికి అన్నదానం చేశారు. దాతలైన ఎనిగండ్ల నరశింహారావు, సైదులు యాదవ్, దొండపాటి వెంకయ్య, ఫణి చంద్ర, నాగేశ్వరరావు దంపతులను సత్కరించి అమ్మవారి జ్ఞాపికలను అందచేశారు. ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి ట్రస్ట్ బోర్డు సభ్యులు, జెట్టిపాలెం టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన మానుకోండి

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రూపకల్పన చేస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించేందుకు మెడికల్ కళాశాలలు నిర్మాణం చేపట్టారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం, ప్రైవేటీకరణ చేయాలని చూడటం దారుణమని పల్నాడు జిల్లా వైసిపి అధ్యక్షులు మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణలో భాగంగా మాచర్ల పట్టణం 31వ వార్డులో ఆదివారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఇసి) మెంబర్ కొమ్మారెడ్డి చాలామారెడ్డి, సత్తెనపల్లి నియోజవర్గం సమ న్వయకర్త డాక్టర్ గజ్జలసుధీర్ భార్గవరెడ్డితో కలిసి పాల్గొ న్నారు. ప్రజల వద్ద నుంచి సంతకాలను సేకరించారు. కార్య క్రమంలో వైఎస్‌ఆర్సిపి నాయకులు బోయ రఘురామి రెడ్డి, పోలా శ్రీనివాసరావు, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, జలీల్, బూడిద శ్రీనివాసరావు, పోలిరెడ్డి కోటిరెడ్డి, పిన్నెల్లి హనీమిరెడ్డి, మాచర్ల సుందర్రావు, మధు గురవయ్య, సైదులు, నాయ కులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

పాఠశాలలకు మూడు రోజులు సెలవు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

గుంటూరు జిల్లా కలెక్టర్ తమీం అన్సారియా ఉత్తర్వుల మేరకు ఫిరంగిపురం మండలంలోని ప్రైవేట్ గవర్నమెంట్ పాఠశాలలో కళాశాలలో విద్యాసంస్థలన్నింటికీ ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు మూడు రోజులు పాటు సెలవులు ప్రకటించినట్లు ఎంఈఓ షేక్ మహబూబ్ సుభాని, సిహెచ్ రవికాంత్ తెలిపారు. మొంథా తుపాన్ కారణంగా అత్యవసరం అయితే తప్ప బయటికి రావద్దన్నారు. తుపాన్ కారణంగా సమస్యలు తలెత్తితే ఫిరంగిపురం మండల స్థాయిలో ఫోన్ నెంబర్. 7032983510, కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌నంబర్ 0863-2234014 నంబర్లను సంప్రదించాలని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆర్‌విఐటి విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆర్‌విఐటి చేబ్రోలు విద్యార్థులు పొన్నూరులో రక్తదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వి. కృష్ణయ్య తెలిపారు. ఆదివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పొన్నూరు రోటరీ క్లబ్‌లో రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పొన్నూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టరు వై.కోటేశ్వరరావు ఏర్పాటు చేశారని అన్నారు. 10మంది ఆర్‌విఐటి విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. విద్యార్థులతో పాటు పొన్నూరు రూరల్ సిఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్‌ఐ పి.వీరనారాయణ, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొని రక్తదానం చేశారు. సిఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ చదువుతోపాటు సేవ కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొంటూ ఇతరులకు తమ వంతు సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.



పనులు పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

కాల్వల పూడికతీత పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడు ఆదివారం పరిశీలించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించేందుకు హుడా కాలనీ, సిబిఎన్ కాలనీ, చినరావూరు డొంకరోడ్డు, సుల్తానాబాద్, జెయంజె కళాశాల పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎమ్‌హెచ్‌ఓ ఏసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

10టన్నుల కూరగాయలు వితరణ

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని మోతడక గ్రామ కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానానికి పది టన్నుల కూరగాయలను వితరణ ఇచ్చారు. టీటీడీ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రముఖ వైద్యులు ఎర్ర నాగేశ్వరరావు జెండా ఊపి లాంచనంగా ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షులు కె.రమేష్‌చంద్ర, మిత్రబృందం, వృద్ధులు పాల్గొన్నారు.

సంగీత సామ్రాట్ సాలూరి చిరస్మరణీయులు

ప్రజాశక్తి - తెనాలి

సినీ సంగీత వినీలాకాశంలో ఒక విశిష్ట స్థానాన్ని పొందిన సంగీత సామ్రాట్ సాలూరి రాజేశ్వరావు ప్రజల హృదయాలలో చిరస్మరణీయులని మహాత్మగాంధీ శాంతిఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి కొనియాడారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ గాందీ శాంతి ఆశ్రమంలో సాలూరి రాజేశ్వ రావు వర్థంతి సందర్భంగా ఆదివారం తెనాలి కల్చురల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఫిలిం సొసైటీ నిర్వాహకులు బొల్లిముంత కృష్ణ, ఓతుకోలు మార్కండేయులు, బోడాసుధాకర్, బెల్లంకొండ వెంకట్, కన్నెగంటి మౌనిక, కన్నెగంటి సుజాత పాల్గొన్నారు. గాయకులు వెంకట్, మౌనిక సాలూరి స్వరపరచిన పాటలను ఆలపించి సంగీతంలోని ప్రత్యేకతలు వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

కమిషనర్ ఆలీంబాష

ప్రజాశక్తి - మంగళగిరి

మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాషా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాను ఈనెల 28వ తేదీ సాయంత్రం లేదా రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిందని తెలిపారు. దాని ప్రభావంతో గంటకు 90 నుంచి 100కి.మీ.ల వేగంతో ఈదురు గాలులు వీయ వచ్చుని, ఈ నెల 26వ తేదీ ఆదివారం నుంచి తుపాను ప్రభావం కనిపిస్తుందని తెలిపారు. అదే సమయంలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అవసరమైతే సురక్షితమైన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలు కూలే ప్రమాదం ఉందని, కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. ఇతర విభాగాల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించామని తక్షణ స్పందన కోసం అధికారుల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంటాయని తెలిపారు. మంగళగిరి అడిషనల్ కమిషనర్ - 9849905836, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మంగళగిరి-8500085027, తాడేపల్లి డిప్యూటి కమిషనర్ - 9849907302, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-8309549599, గ్రామాలలో అసిస్టెంట్ కమిషనర్ - 93466 23999, వారిని సంప్రదించడంతో పాటు ముందస్తు సమాచారం అందించేందుకు నగర పాలక సంస్థ నుంచి ప్రత్యేక కాల్ సెంటర్ నెంబర్లు 7093912653, 08645-295193ఏర్పాటు చేసామనీ, తద్వారా సత్వర పరిష్కార చర్యలు చేపడతామని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ తెలిపారు..



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ నాయకులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మంగళగిరి-తెనాలి రోడ్డులోని శ్రీమార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మంటపంలో సొసైటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేతలో ఉన్న 620మంది పేద విద్యార్థులకు రూ.22 లక్షల విలువైన ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రియల్‌ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఓల్డ్ టైం నెంబర్ ఎం.వెంకటేశ్వర్లు, తిరుపతి టీటీడీ చీఫ్ ఆడిట్ అధికారి అందెవెంకటేశ్వరరావు, విశాఖపట్నం సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్‌జైల్స్ సిహెచ్ సూర్యకుమార్, ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస రావు, సీకే జూనియర్ కళాశాల సెక్రటరీ గంజి చిరంజీవి, సొసైటీ గౌరవాధ్యక్షులు జొన్నాదుల బాబు శివప్రసాద్, కార్యదర్శి ప్రెగడ రాజశేఖర్ పాల్గొన్నారు

గర్భిణీలను ఆసుపత్రిలో చేర్పించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణీలను ఆసుపత్రులలో చేర్పించాలని గుంటూరు జిల్లా మార్కెట్ డిఎం, నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.నరసింహారెడ్డి వైద్యశాఖ అధికారులను కోరారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో రాబోయే మొంతా తుఫాన్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అధికారులను కోరారు. ముంపునకు గురయ్యే ప్రాంత ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలనీ, అధికారులందరూ అందుబాటులో ఉంటూ సమన్వయంతో పని చేయాలని కోరారు. రోడ్ల పక్కన చెట్లపై దృష్టి సాధించాలని ఆర్‌అండ్‌బి శాఖ అధికారులను, కరెంటు తీగలు పటిష్టం చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. నిత్యావసర వస్తువులు ఇళ్ళలో ఉంచుకోవాలనీ, పిల్లలు, వృద్ధులు అవసరమైతే తప్ప బయటకు రావద్దని గ్రామాలలో దండోరా వేయించాలని కోరారు. అనంతరం స్థానిక ఎస్సీ, బిసి బాలురుల హాస్టలును పరిశీలించి పిల్లలను గురువారం వరకు ఇంటికి పంపించేయాలని వార్డెనుకు చెప్పారు. తహశీల్దార్ ఐ.సునీత ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు వ్యవసాయాఅధికారి ఆర్.విజయబాబు, పిఎం జి సురేష్‌కుమార్, ఎంఈఓ-2 లక్ష్మీనారాయణ, డాక్టర్ అబ్దుల్ ఇజాస్, రెహమాన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారెడ్డి



సంతకాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

వ్యవస్థలన్నీ నిర్వీర్యం

ప్రజాశక్తి- తాడేపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఎమ్మెల్సీ ఎం హనుమంతరావు, వైసిపి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ అధ్యక్షులు బురముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణంలోని మహానాడు 23వ రోడ్డు అధ్యక్షులు ఆర్,భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చినవారు మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు ముఖ్యమైన విద్యా వైద్యాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పేద ప్రజల పక్షాన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్న పోతుల దుర్గారావు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు (పండు), జిల్లా మైనారిటీ విభాగ కార్యవర్గ సభ్యుడు సయ్యద్ సలాం, ముఖ్య నాయకులు, కార్యకర్తలు వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రగ్బీ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి అరవింద సిబిసిఈ హైస్కూల్‌లో శనివారం ఖేలో ఇండియా నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ పోటీలలో వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప పోటీలలో మూడవ స్థానంలో గెలుపొందిన రగ్బీటీం విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు ఈ పోటీల ద్వారా మంచి గుర్తింపు తీసుకువచ్చారని భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో కూడా పోటీలలో పాల్గొని, విజయం సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రవి, నూతక్కి రవి, సతీష్ గెలుపొందిన క్రీడా కారులను అభినందించారు.



రగ్బీకి ఎంపికైన విద్యార్థులు



దీక్షల్లో కూర్చున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

327వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 327వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వి దుర్గారావు, యూనియన్ నాయకులు కేస్టీవెన్, తుపాకుల నాగేశ్వరావు, మల్లె గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో బోందలపాటి నవనితమ్మ, మొలక శారదా, దేరంగుల రమణమ్మ, ముసలాసాంబశివరావు, దామవరపు నాగేశ్వరావు కూర్చున్నారు. కార్యక్రమంలో వై.సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు, కొదమల రవికుమార్, బి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లయన్ లక్ష్మీనారాయణ

సేవా కార్యక్రమాలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

లయన్స్ క్లబ్ అంటే సేవకు ప్రతిరూపమని ప్రతి సభ్యుడు సేవా కార్యక్రమాల మీద దృష్టి సారించి శ్రద్ధ తో పని చేయాలని లయన్స్ క్లబ్ పస్ట్ డ్రిస్టిక్ట్ వైస్ చైర్మన్ పీఎంజేఎఫ్ లయన్ ఆర్.లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ అనుబంధ పల్నాడు రీజియన్- వి.గెట్ టుగెదర్, రీజియన్ పరిధిలోని జోన్ 9, 10, 11ల అడ్వైజరీ సమావేశం ఆదివారం సత్తెనపల్లి పట్టణం లోని వేద జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో నిర్వహిం చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు లయన్ బండ్లమూడి వీరాంజనేయులు ఆతిథ్యంలో రీజి యన్ చైర్మన్ లయన్ తోట చిన్న సాంబశివయ్య ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫస్ట్ డిస్ట్రిక్ట్ వైస్ చైర్మన్ పీఎంజేఫ్ లయన్ ఆర్.లక్ష్మీనారాయణ విచ్చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన ప్రసంగించారు. రీజియన్ పరిధిలోని జోన్9 చైర్మన్ లయన్ మద్ది సుధాకర్, జోన్ 10 చైర్మన్‌లయన్ టంగుటూరి వెంకట సతీష్‌కుమార్, జోన్ 11 చైర్మన్ లయన్ ఆలపర్తి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగిస్తూ క్లబ్బు పనితీరు, స్థితిగతులపై వివరణ ఇచ్చారు. అనంతరం రీజియన్ చైర్మన్ లయన్ తోట చిన్నసాంబశివయ్య, డిస్ట్రిక్ట్ కోఆర్డి నేటర్ ఫర్ రీజియన్ చైర్మన్ లయన్ కంబాల వెంకటేశ్వరరావు, ఫస్ట్ డిస్ట్రిక్ట్ వైస్ చైర్మన్



రోడ్లు బాగు చేయిస్తున్న అధికారులు

రోడ్డు బాగు చేయిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు పదో వార్డు సభ్యులు వెలినేని శివయ్య పెదనందిపాడులో గుంటూరు పర్చూరు రోడ్డుకు పడ్డ గుంటలు బాగు చేయాలని గురువారం పిజిఆర్ఎస్‌లో పెట్టిన పిటిషన్‌పై స్పందించిన అధికారులు శుక్రవారం రోడ్లు పరిశీలించి, ఆదివారం రోడ్డు బాగు చేసే కార్యక్రమం చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రోడ్లు రహదారులు భవనాల శాఖ ఏఈఈ సాయి కృష్ణ ఆదేశాల మేరకు అత్యవసర నిధుల నుండి రోడ్డు మరమ్మతులు ప్రారంభించినట్లు వర్క్‌ఇన్‌స్పెక్టర్, నరసింహారావు, వర్క్‌చార్టర్ రత్న తెలిపారు. ఫిర్యాదు దారుడు వెలినేని శివయ్యను ఆర్‌అండ్‌బి అధికారులను గ్రామస్తులు, వాహనదారులు,ప్రయాణికులు అభినందనలు తెలిపారు.



నూతన కమిటీ

లౌకికవాదం, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో లౌకికవాదం, ప్రజస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిస్టీ పిలుపు నిచ్చారు. అవాజ్ పశ్చిమ కమిటీ విస్తృత సమావేశం ఆదివారం గుజ్జన గుండ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిస్టీ మాట్లాడుతూ బిజెపి అధికారం లోకి వచ్చాక దేశంలో మతో న్మాదం పెరిగింద`న్నారు. మైనార్టీలపై దాడులు పెరుగు తున్నాయన్నారు. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు.బ్రిటీషు వారి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్యం సాధనలో హిందూ, ముస్లిం, అన్ని మతాలు కలిసి పోరాడిన స్ఫూర్తితో రాజ్యాంగం, లౌకిక వాదం పరిరక్షణకు మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్ను కున్నారు. షేక్ బాష, షేక్ ఖాసింవలి అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. సభలో జిల్లా కార్యదర్శి షేక్. భాషా, నాయకులు ఎం.డి.అక్బర్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు నళినీకాంత్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, డాక్టర్ గేయానంద్ తదితరులు

ఆలోచనా శక్తి పెంపొందించే విధంగా బోధించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ప్రశ్నించే తత్వం పెంపొందే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవిఎస్ లక్ష్మణరావు అన్నారు. జెవివి ఆధ్వర్యంలో బయాలజీ ఉపాధ్యాయులకు ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి' అనే పుస్తకాన్ని కెవిఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి టి.సురేష్, ఎం.ఉదయభాస్కర్, టి.జాన్‌బాబు, జి.వెంకటరావు, బి.ప్రసాద్, డాక్టర్ ఎ.ఎస్.ప్రసాద్, టి.ఆర్.రమేష్, యు.రాజశేఖర్‌రావు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల శిక్షణకు రిసోర్స్‌పర్సన్‌గా సిహెచ్.వీరప్పయ్య, ఎం.డి.గౌస్, సీతారామయ్య, గంగాధర్ వ్యవహరించారు.

హార్మోన్ల అసమతుల్యతే అన్ని రోగాలకూ కారణం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట సందీప్

మన శరీరంలోని అన్ని అనారోగ్య సమస్యలకు హార్మోన్ల అసమతుల్యత కారణమని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నంది పాటి వెంకట సందీప్ అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ వెంకట సందీప్ మాట్లాడుతూ నేడు అత్యధిక మంది ప్రజల్లో ఉన్న మధుమేహం సమస్య బీటా కణాల లోపం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి కారణాలే కాకుండా కొన్ని హార్మోన్ల సమతుల్యత కోల్పోవడం వల్ల కూడా వస్తుందన్నారు. కావున రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు మంచి నిద్రపోతూ, మానసిక ఒత్తిడికి గురి కాకుండా, పౌష్టికాహారం తీసుకుంటూ, శరీరానికి వ్యాయామం ఉండేలా చూసుకుంటే మధుమేహ సమస్య నుండి బయటపడవచ్చన్నారు. థైరాయిడ్ వ్యాధి గురించి మాట్లాడుతూ థైరాయిడ్ గ్రంథి థైరాక్సిన్ హార్మోన్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసినప్పుడు హైపర్ థైరాయిడిజం వస్తుందని, తక్కువ ఉత్పత్తి చేసినప్పుడు హైపో థైరాయిడిజం వస్తుందన్నారు. హైపర్ థైరాయిడిజం వచ్చిన వారిలో బరువుపెరగడం, ఆకలి పెరగడం, జుట్టు రాలటం, నీరసం లాంటి సమస్యలు కనిపిస్తాయన్నారు. హైపోథైరాయిడిజం సమస్య ఉన్నవారిలో బరువు తగ్గటం, ఆకలి మందగించడంలాంటి లక్షణాలు కనబడతాయన్నారు. ఆడవారిలో గర్భం ధరించిన సమయంలో వచ్చే జస్టేషనల్ డయాబెటిస్‌కు కారణం కూడా హార్మోన్ల అసమతుల్యతే నని, కాకపోతే ఈసమయంలో వచ్చిన మధుమేహం డెలివరీ అయిన తర్వాత తగ్గిపోతుందన్నారు. హార్మోన్ల అసమతుల్యతవల్లే ఆడపిల్లలు త్వరగా రజస్వల అవడం, పిల్లలు ఊబకాయం రావడం లాంటి సమస్యలు వస్తాయన్నారు. శరీరంలో అతి ముఖ్యమైన ఎడ్రినల్ గ్రంధి గురించి మాట్లాడుతూ దీని వల్ల కార్టిసోల్ హార్మోన్ ఉత్పత్తి అవుతుందని, కార్టిసాల్ స్థాయిలు ఎక్కువైతే ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని, దీర్ఘకాలంలో ఇది ఆరోగ్యానికి హానికరం అన్నారు. అయితే అడ్రినలిన్ గ్రంధి శరీరానికి అవసరమైన శక్తి కోసం రక్తంలో గ్లూకోజ్ (చక్కెర) స్థాయిని పెంచుతుందని, మెదడు రక్తంలో గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని, కణజాలాలను రిపేర్ చేయడానికి అవసరమైన పదార్థాలు అందిస్తుందని, మూత్రపిండాల పనితీరును నిర్వహిచటంలో, ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి దోహదం చేస్తుందని, రోగనిరోధక శక్తిని నియంత్రించటంలో సహాయ పడుతుందని చెప్పారు. ఈ హార్మోన్ ఉత్పత్తి లోపం వల్ల నీరసం, బరువు తగ్గడం, హార్ట్ బీట్ తగ్గటం ఇలాంటి లక్షణాలు కనబడతాయన్నారు. ఇలాంటి లక్షణాలు కనబడిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగు వైద్యం తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకట సందీప్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. ఈ సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ ఆర్.వి.ఫణి, అవగాహన సీనియర్ సభ్యులు తాళ్ల నారపరెడ్డి, జెవివి నాయకులు సేతు రామేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

తుపానును సమర్ధవంతంగా ఎదుర్కొందాం

అధికారులతో మేయర్, కమిషనర్ సమావేశం



మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మొంథా తుపానును గుంటూరు నగరంలో సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సిద్దంగా ఉండాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మొంథా తుపాన్ వలన ఇబ్బందులు కలగకుండా నగరంలో తీసుకోవలసిన ముందస్తు చర్యల పై కార్పొరేటర్లు, అధి కారులు సచివాలయ కార్యదర్శులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అత్యవసర సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, నగరంలో ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు అధికారులు మరియు కార్యదర్శులు సిద్దంగా ఉండాలన్నారు. కమిషనర్ మాట్లా డుతూ మొంథాతుఫాన్ రానున్న మూడు రోజులు తీవ్ర గాలులతో కూడిన భారి నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపధ్యంలో గుంటూరులో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న మూడు రోజులు అధికారులు కార్యదర్శులలో ఏ ఒక్కరికి సెలవులు లేవని ప్రతి ఒక్కరు విధులు కేటాయించిన ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేన్నారు. వార్డు సచివాలయం కేంద్రంగా ముంపు ప్రాంతాలు, పాత భవనాలు, పురాతన చెట్లు, వంగిన విద్యుత్ స్తంబాలను గుర్తించడం, తుపాన్ ప్రమాదం పై ప్రజలకు అవగాహన కలిగించడం చేయాలన్నారు. రెండు వార్డులకు ఒక ప్రత్యేక అధికారితో కూడిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ (0863-2345103, వాట్సప్ నెంబర్ 98499 08391) నగర పాలక సంస్థ కాన్ఫరెన్సు హాల్ లో ఏర్పాటు చేశామని, క్షత్ర స్ధాయిలో ఏ విపత్కర పరిస్థితిని గుర్తించినా వెంటనే కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించాలన్నారు. సచివాలయం పరిధిలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు నోడల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలలో వసతి మరియు భోజనం ఏర్పాట్లను కూడా స్వచ్చంద సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు.గుంటూరు నగరంలో గత అనుభవాల దృష్ట్యా ప్రగతి నగర్, మురికిపేట, తుపాన్ నగర్, మూడు వంతేనలు, కంకగుంట ఆర్.యూ.బి, జియాఉద్దీన్ నగర్, యానాది కాలని, చంద్రబాబు నాయుడు కాలని, తారకరామా నగర్, ఏ.టి అగ్రహారం, జున్ను షాహీద్ నగర్ వంటి 12 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, ఆయా ప్రాంతాల పై అధికారులు ప్రత్యేక ద్రుష్టి సారించాలన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యస్.ఓ.పి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) మేరకు తుపాన్ ముందస్తు, తదుపరి చర్యలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎక్కడైనా అశ్రద్ధ వలన అవాంచనీయ సంఘటనలు జరిగితే సంబధిత అధికరి మరియు కార్యదర్శులే బాధ్యతవహించాలన్నారు. హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి. వెంకటకష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జ్ యస్.ఈ. సుందర్రామి రెడ్డి, కార్పోరేటర్లు, అధికాలరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం

ప్రతి నియోజకవర్గంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలు : ప్రజాశక్తితో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు



పల్నాడు జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా యువతకు ఆసక్తి ఉన్న రంగాలలో శిక్షణ తరగతులు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ ద్వారా విదేశాలలో కూడా యువతకు ఉపాధి అవ కాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

స్కిల్ ఇంటర్నేషనల్ ద్వారా ఉపాధి అవకాశాలు?

స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ద్వారా జర్మనీ, జపాన్, సౌదీ అరేబియా, ఖత్తర్, రష్యా, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలలో యువతకు నర్సింగ్, వెల్డర్, ఎలక్ట్రిషన్ ప్లంబింగ్, టైల్స్, మార్బుల్స్ తదితర రంగాలలో అవకాశాలు ఉన్నాయి. వీరికి క్లస్టర్ స్థాయిలో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది.

విదేశాలకు వెళ్లిన యువత భద్రత?

ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఓవర్సీస్ మాన్ పవర్ కన్సల్టెన్సీ ఆంధ్రప్రదేశ్ (ఓమ్కాప్) ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో అభ్యర్థులు మోస పోవడానికి ఇటువంటి ఆస్కారం లేదు. ఇలా ఒప్పందంపై వెళ్లిన అభ్యర్థులు తమకు అక్కడ ఉండడం ఇష్టం లేకపోతే నిరభ్యంతరంగా వెనక్కు వచ్చే అవకాశం ఉంటుంది. కన్సల్టెన్సీ ప్రతినిధులు అక్కడ ఉద్యోగం చేస్తున్న వారిని స్వయంగా కలిసి ఇబ్బందులు ఏమన్నా ఉన్నాయో తెలుసుకొని భద్రత కల్పిస్తారు. ఇంటర్నేషనల్ స్కిల్ ప్రోగ్రాం ద్వారా క్లస్టర్ స్థాయిలో నిర్వహించే ఆరు నెలల శిక్షణ తరగతులలో ఎస్‌సి, ఎస్‌టిలకు పూర్తి ఉచితంగా వసతి కల్పిస్తాం.

ఏ తరహా నిరుద్యోగులకు శిక్షణ ఇస్తారు?

8వ తరగతి నుండి ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తర్ణీత సాధించిన 18 ఏళ్ల నుండి 35 వయసు కలిగిన నిరుద్యోగ యువతకు తమకు అభిరుచి రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

ఇప్పటి వరకు ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించారు?

జిల్లాలో నిర్వహించిన 14 జాబ్ మేళాలకు 9720 మంది యువత హాజరయ్యారు. వీరిలో 1781 మందికి ఉద్యోగ,ఉపాది అవకాశాలు దక్కాయి. గత ఏడాది 38 జాబ్ మేళాలు నిర్వహించగా 6300 మంది యువత హాజరయ్యారు. వీరిలో 1029 మంది యువత కొలువులు సాధించారు. ఆయా జాబ్ మేళాలకు హాజరై ఉపాధి అవకాశాలు పొందని యువతకు మళ్ళీ శిక్షణ ఇచ్చి అవకాశాలు కల్పించడం జరుగుతుంది.

యువత ఏరంగాలపై ఆసక్తి చూపుతున్నారు?

టెక్స్‌టైల్, ఎలక్ట్రిషన్, ప్లంబింగ్, కంప్యూటర్ బేసిక్స్, డేటా ఎంట్రీ, మార్కెటింగ్ స్కిల్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ తదితర రంగాలలో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుంది. యువత ప్రధానంగా కంప్యూటర్ అనుబంధ కొలువులు పట్ల ఆసక్తి చూపుతున్నారు.

శిక్షకులు, ఇతర సిబ్బంది కొరత ఏమైనా ఉందా?



సంస్థలు ఆయా రంగాలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించే సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారు. ఎటువంటి సిబ్బంది కొరత లేదు. సంస్థ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలనుకునే యువత కలెక్టరేట్ ప్రాంగణం లోని కార్యాలయంలో కానీ లేదా 95815 55000, 9160031006 సంప్రదించాలన్నారు. పల్నాడు జిల్లా లోని 7 నియోజకవర్గాలలో 3 నెలలకు ఒక జాబ్ మేళా చొప్పున ఏడాదికి 28 జాబ్ మేళాలు నిర్వహిస్తాం.


జాబ్ మేళాల్లో పాల్గొంటున్న కంపెనీలు?

ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో 500 కు పైగా వివిధ రకాల పరిశ్రమల అవసరాల మేరకు వారితో చర్చించి ఆ దిశగా యువతకు శిక్షణ ఇచ్చి, సంస్థలకు కావాల్సిన కావలసిన రీతిలో అభ్యర్థులను తీర్చిదిద్ది జాబ్ మేళాలు నిర్వహించి ప్రతిపచాటిని అభ్యర్థులకు తక్షణమే అవకాశాలు కల్పిస్తారు.


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అభ్యుదయవాది దావులూరి సాంబశివరావు కన్నుమూత

ప్రజాశక్తి-గుంటూరు



అభ్యుదయవాది, సిపిఎం అభిమాని దావులూరి సాంబశివరావు (85)ఆదివారం కన్ను మూశారు. అయనకి భార్య శివనాగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి విజయనగరం జెఎన్‌టియూ గురజాడ యూనివర్సిటీ విసిగా, ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కుమారుడు డి. వీరప్రసాద్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. నవభారత్ నగర్‌లోని అయన నివాసంలో సాంబశివరావు భౌతిక ఖాయానికి సిపిఎం నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. సాంబశివరావు ఆర్మీలో పనిచేశారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అంటే విపరీతమైన అభిమానం. సుందరయ్యపై ఉన్న అభిమానానికి గుర్తుగా అయన నివాసంలో సుందరయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నివాళి అర్పించిన వారిలో సిపిఎం నాయకులు ఎన్.కాళిదాసు, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు బి.ముత్యాలరావు, ఖాసీం షహీద్, మస్తాన్‌వలి, కళ్యాణి, కుటుంబ సభ్యులు ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు సంతాపం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థంబాలగరువు మహా ప్రస్థా నంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు